ఉపాధిలో భారీగా అక్రమాలు!

- బినామీ మస్టర్లతో నిధులు స్వాహా
- సోషల్ ఆడిట్‌లో బట్టబయలు

ఉదయగిరి : మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో చోటు చేసుకున్న అక్రమాలు ప్రస్తుతం చేపడుతున్న సోషల్ ఆడిట్ తనిఖీల్లో వెలుగు చూస్తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది బినామీ మస్టర్లు, డబుల్ జాబ్ కార్డుల పేరుతో చేతివాటం ప్రదర్శించి పెద్ద మొత్తంలో జేబులు నింపుకొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో బయటపడుతున్న అక్రమాలను చూసి ఆడిట్ బృందాలు కూడా నివ్వెరపోతున్నాయి.

మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ శాఖల్లో రూ.14.08కోట్లతో పనులు చేపట్టారు. అందులో కూలీలకు నగదు రూపంలో రూ.10.75కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.3.32 కోట్లు మెటీరియల్ సామగ్రి పేరుతో కాంట్రాక్టర్ల ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఇరిగేషన్ ద్వారా ట్యాంక్‌బండ్ పనులు మాత్రమే చేపట్టారు. ఈ పనులకు సంబంధించి మెటీరియల్ కోసం రూ.1.94 కోట్లు కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 47 పనులు చేపట్టగా రూ.96 లక్షలు ఖర్చు చేశారు. ఎన్‌ఆర్‌ఈజీయస్ ద్వారా 590 పనులు చేపట్టగా, కూలీలకు రూ.10.75 కోట్లు, మెటీరియల్‌కు రూ.42.31 లక్షలు ఖర్చు చేశారు.

క్షేత్రస్థాయి తనిఖీల్లో వెలుగులోకి

మండలంలోని 17 పంచాయతీల పరిధిలోని 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి ఎస్సార్పీ బుజ్జయ్య అధ్వర్యంలో ఏడు సోషల్ ఆడిట్ బృందాలు ఈ నెల 7వ తేదీ నుంచి తనిఖీలు ప్రారంభించాయి. ఇప్పటికే ఏడు పంచాయతీల్లో తనిఖీలు పూర్తి చేసిన సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించిన అక్రమాలు, అవకతవకలను గ్రామసభల్లో చదివి వినిపించారు. ఈ నెల 17వ తేదీ వరకు క్షేత్రస్థాయి


ఉదయగిరిలో గ్రామకొలను పనులను కొలతలు వేస్తున్న ఆడిట్‌బృందం

తనిఖీలు కొనసాగనున్నాయి. ఈ నెల 18వ తేదీన మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో జరిగే సామాజిక తనిఖీ ప్రజావేదికలో నివేదికలను వెల్లడించనున్నారు. ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో బినామీ మస్టర్లు, డబుల్ జాబ్ కార్డుల ద్వారా ఫీల్డ్‌అసిస్టెంట్లు నిధులు స్వాహా చేసినట్లుగా గుర్తించారు. చాలా మంది కూలీలు పనికి వెళ్లకున్నా వారి పేర్లను నమోదు చేసి వారికి నామమాత్రంగా కొంత నగదు ఇచ్చి మిగిలిన మొత్తం కాజేశారు. ఈ వ్యవహారంలో టీఏ, ఈసీ, ఏపీఓ, ఎంపీడీఓల వరకు వాటాలు వెళ్లినట్లు కొందరు ఫీల్డ్‌అసిస్టెంట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.70 లక్షలకుపైగా అవినీతి అక్రమాలు జరిగినట్లుగా సమాచారం. ఆడిట్ మొత్తం పూర్తయితే రూ.కోట్లలో అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.


జీ చెరువుపల్లిలో కుంట పనులను కొలతలు వేస్తున్న ఆడిట్‌బృందం

రికార్డులివ్వని ఫీల్డ్‌అసిస్టెంట్లు

సోషల్ ఆడిట్ బృందాలకు కొన్ని పంచాయతీల క్షేత్రసహాయకులు ఇంత వరకు కూడా రికార్డులు ఇవ్వలేదు. ముఖ్యంగా కూలీలకు సంబంధించిన మస్టర్లు ఇవ్వలేదు. వీటి ద్వారా అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉన్నందున అవి బయట పెట్టలేదు. దీంతో ఎంబుక్‌లు, పే ఆర్డర్ల ఆధారంగా తనిఖీ చేస్తున్నారు. ఎంబుక్‌ల్లో ఉండే కొలతలకు, క్షేత్రస్థాయి కొలతలకు కూడా చాలా వ్యత్యాసాలు బయటపడుతున్నాయి. పనులు చేపట్టకుండానే పాత పనులు చూపించి ఎంబుక్‌లు రికార్డు చేయడంతో కొలతల్లో భారీగా వ్యత్యాలు వెలుగు చూస్తున్నాయి. పంచాయతీరాజ్, ఇరిగేషన్ పనుల్లో మెటీరియల్ సామగ్రికి చెల్లింపుల్లోనూ అక్రమాలు వెలుగు చూసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఘనంగా ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని కాశీనాయన ఆశ్రమ పాఠశాలలో వార్షిక వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష నగదు విరాళాన్ని ప్రకటించారు. విద్యార్థులు సంప్రదాయ వాతావరణంలో పెరిగి చదువుల్లో ఉన్నత స్థితికి చేరుకుని పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల నిర్వాహకులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

50శాతం రాయితీపై విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

ఆత్మకూరు: గృహ విద్యుత్ వినియోగదారులు వాడుకుంటున్న అదనపులోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్‌శాఖ 50శాతం రాయితీని ఇస్తోందని ఆత్మకూరు ఏడీ సురేష్ శనివారం తెలిపారు. గతంలో 1 కిలోవాట్‌కు రూ.2,250 ఉండగా, ప్రస్తుతం రూ.1250 చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. 2 కిలోవాట్లకు రూ.4450 కాగా, ప్రస్తుతం రూ.2,450, 3 కిలోవాట్లకు రూ.6,650 కాగా, ప్రస్తుతం రూ.3,650, 4 కిలోవాట్లకు రూ.8,850కాగా, ప్రస్తుతం రూ.4,850, 5 కిలోవాట్లకు రూ.11,050 కాగా, ప్రస్తుతం రూ.6,050 చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

సీతారామపురం : స్థానిక బాలత్రిపురసుందరీదేవి యోగానంద ఆశ్రమంలో అయ్యప్పస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని విశేషాభిషేకాలు, పడిపూజ, హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రూ. 2.20 కోట్లతో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం : మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఎంపీపీ జనరల్ ఫండ్ నిధులు రూ.2.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి శనివారం తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు రూ. 82.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో రచ్చఅరుగుల నిర్మాణానికి రూ.26.40 లక్షలు, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.12 కోట్లను కేటాయించినట్లు వివరించారు. ఆదివారం ఆయా పనులకు శంకుస్థాపనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

చింతలదేవిలో ఎమ్మెల్యే కాకర్ల పర్యటన



కొండాపురం : చింతలదేవిలోని జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం సందర్శించారు. కేంద్రంలోని పశువులను పరిశీలించి ఎన్ని రకాల పశు జాతులు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు అభివృద్ధి కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట కేంద్రం జేడీ వెంకటేష్, డీడీ పెద్దిస్వామి, మాజీ జెడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ వైస్‌ఎంపీపీ పోలినేని చంద్రబాబు ఉన్నారు.

బీసీ కులాలకు పనిముట్లు



దుత్తలూరు: మండలంలోని బీసీ కులాల వారికి ప్రభుత్వం ఆదరణ పథకం–3 కింద పనిముట్లు అందజేయనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జున తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కులాల ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. బీసీ కులాల వారికి అవసరమైన పనిముట్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ వర్గాలకు అవసరమైన పనిముట్ల వివరాలు సేకరించమని ఆదేశాలు ఇచ్చిందన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

కంప్యూటర్ బహూకరణ



కలిగిరి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ఆవుల కృష్ణారెడ్డి శనివారం కంప్యూటర్‌ను బహూకరించారు. హెచ్‌ఎం భీమేశ్వరరావు,ఉపాధ్యాయిని సుగుణమ్మ పాల్గొన్నారు.

వేడుకగా జనార్దనస్వామికి మండలాభిషేకం



దుత్తలూరు: నర్రవాడలోని జనార్దనస్వామి ఆలయంలో మండలాభిషేకాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. జీర్ణోద్ధరణ ఉత్సవాలను జరిపి 24రోజులు పూర్తయిన సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం జనార్దనస్వామికి కల్యాణోత్సవం, పల్లకిసేవ జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ మాదాల ఎస్ బాబురావు, సభ్యులు మాదాల తిమ్మయ్యచౌదరి, భోగినేని రామచంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులను ఆదుకోండి

ఆత్మకూరురూరల్: కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకుడు లక్కు ప్రసాద్ కోరారు. శనివారం ఆయన సహచర రైతు నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, చిన్నపరెడ్డి, తదితరులతో పాటు తహసీల్దార్ సుధీర్‌ను కలిసి రైతుల సమస్యలను విన్నవించారు. జిల్లా వ్యాప్తంగా 300 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ నెల 20వ తేదీపైన వరి కోతలు పూర్తి స్థాయిలో ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రభుత్వం యంత్రాంగం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కాకాణి

వరికుంటపాడు/ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్య పడాల్సిన పనిలేదని, ప్రతిఒక్కరికీ అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. వరికుంటపాడులో పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాకాణి పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీ వారు బోగస్ కేసులతో వేధిస్తున్నారని, వారికి పోలీసులు కూడా వత్తాసు పలుకుతున్నారన్నారు. కొందరు పోలీసులు రాజకీయ నేతల్లా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉండమని చెబుతున్నారని ఆరోపించారు. కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ఒక్కరికి అన్యాయం జరిగినా జిల్లా నాయకులందరం అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని గుర్తుంచుకుంటామని, అధికారంలోకి వచ్చాక ఎవర్నీ వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్తులో పార్టీ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కార్యకర్తల విషయంలో జరిగిన పొరపాటును అందరూ గుర్తించారని, ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదన్నారు. భవిష్యత్ మనదేనని, భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా అందరం కలిసి కట్టుగా పార్టీ విజయం కోసం శ్రమించాలన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన అధికారం మనదే..అందుకోసం గ్రామస్థాయిలో కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను గుర్తించి ప్రజలకు వివరించాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం ఎలా ఎగనామం పెట్టిందో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మరో రెండేళ్లలో జమిలీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున త్వరలో అధికారంలోకి వస్తామని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలకు వ్యతిరేకంగా కలిసి కట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను వదిలే ప్రసక్తి లేదన్నారు. అంతకు పదిరెట్లు బదులిస్తామని హెచ్చరించారు. కాగా నియోజకవర్గ స్థాయి సమావేశానికి నాయకులు,


హాజరైన నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తలు భారీగా తరలిరావడంతో క్యాడర్‌లో జోష్ కనిపించింది. ఈ సమావేశంలో పార్టీ నేతలు అలీఅహ్మద్, పల్లాల కొండారెడ్డి, తుమ్మల వెంగయ్య, ఇస్కా మదన్, పీ మాల్యాద్రిరెడ్డి, మోదీ రామాంజనేయులు, ఎం తిరుపతినాయుడు, ఆర్ శ్రీనివాసరెడ్డి, చిమ్మిలి రవీంద్ర, గణపం రమేష్‌రెడ్డి, మద్దూరి బాబు, ఆనంగి రమణయ్య, డేగా వంశీ, ముర్తుజా హుస్సేన్, జీ శ్రీనివాసరెడ్డి, అక్కులరెడ్డి, గుంటుపల్లి అంజనేయులు, శ్రీకాంత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ ధ్యాన మందిరం అద్భుత నిర్మాణం



దుత్తలూరు: వైఎస్సార్ ధ్యాన మందిరం అద్భుత నిర్మాణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. దుత్తలూరులో జేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వైఎస్సార్ ధ్యాన మందిరాన్ని ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన సందర్శించారు. వైఎస్సార్‌పై అభిమానంతో సొంత నిధులతో ధ్యానమందిరాన్ని నిర్మించిన దొంతిరెడ్డి సోదరులను అభినందించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మందిరం విషయాన్ని తీసుకెళ్లి ఆయన చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు


సుధీర్‌నాయుడు


సుబ్బరాయుడుగుప్తా


కృష్ణారెడ్డి


షాహుల్‌హమీద్

కావలి: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులను వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పదవులు వరించాయి. పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు దామిశెట్టి శ్రీనివాసులునాయుడు కుమారుడు దామిశెట్టి సుధీర్‌నాయుడును రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా, మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తాను రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అలాగే రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సంయుక్త కార్యదర్శిగా పానుగోటి కృష్ణారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా షేక్ షాహుల్ హమీద్‌ను నియమించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



కొండాపురం : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కోటేశ్వరరావు హెచ్చరించారు. మర్రిగుంటలోని సర్వే నంబర్లు 219-26, 207, 281-1, 281-11లోని 63.95 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండ్ల చినఅంకయ్య అనే వ్యక్తి ఆక్రమించి పంటలు సాగుచేస్తుండగా సర్పంచ్ దార్ల గోపి పలుమార్లు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకు స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ భూమిలో శనివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించిన ఇండ్ల చినఅంకయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేయించడంతో పాటు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించామని తెలిపారు. కాగా సర్పంచ్ గోపి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఇండ్ల చిన అంకయ్యపై మూడుసార్లు కొండాపురం పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలోకి ఎవ్వరూ దిగకుండా 144 సెక్షన్‌ను విధించి కాపాడాలని కోరారు.

యువకుడి నిజాయతీ



కావలి: ఆర్టీసీ బస్సులో తనకు దొరికిన బంగారు నగల పర్సును ఆర్టీసీ అధికారులకు అప్పగించి కావలికి చెందిన ఓ యువకుడు తన నిజాయతీని చాటుకున్నాడు. వివరాలు.. తిరుపతి నుంచి విజయవాడకు వెళుతున్న ఆటోనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో నెల్లూరు వరకు ప్రయాణించిన ఓ మహిళ తన పర్సును సీట్లో మరిచిపోయి దిగిపోయింది. దాన్ని గమనించిన కావలిలోని వడ్డిపాళేనికి చెందిన రాము ఆర్ట్స్ నిర్వాహకుడు యనమల తారక్ బస్సు డ్రైవర్ డీ రవికి అందజేశాడు. అనంతరం బస్సు కావలికి చేరగానే ఇద్దరూ కలిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులుకు అందజేశారు. వారి సమక్షంలోనే డీఎం పర్సును తెరిచిచూడగా అందులో విలువైన రెండు బంగారు దండలు, ఒక ఉంగరం, రూ.6వేలు నగదు ఉన్నాయి. పర్సులోని ఆధారాలను బట్టి ప్రయాణికురాలిని గుర్తించి కావలి రెండో పట్టణ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ తిరుపతిస్వామి ద్వారా అందజేశారు. ఎంతో నిజాయతీతో పర్సును అందజేసిన యనమల తారక్, బస్సు డ్రైవర్ డీ రవిను డీఎం అభినందించారు.

పరీక్ష కేంద్రాల్లో మెరుగైన వసతులు


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

సంగం: పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు డీఈఓ బాలాజీ రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాట్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఎలాంటి భయాందోళన లు లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ జానకీరాం, ఎంఈఓ మల్లయ్య, హెడ్‌మాస్టర్ బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చేజర్ల: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ-2 డీసీ మస్తానయ్య శనివారం తెలిపారు. చేజర్ల ఉన్నత పాఠశాలలో 144, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 118, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 102 మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన బెంచీలు, తాగునీరు, దీపాలు, ఫ్యాన్లు, తదితర వసతులన్నీ కల్పించామని తెలిపారు. 32 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు సింగారెడ్డిపల్లెకు చెందిన విశ్రాంత హెచ్‌ఎం పానెం నాగయ్య జ్ఞాపకార్థంగా నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు, ద్వితీయ స్థానానికి రూ.3వేలు, తృతీయ స్థానానికి రూ.2వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించారు.

నగర పంచాయతీగా మార్చాలని వినతి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మేజర్ పంచాయతీని నగర పంచాయతీగా మార్పు చేసేందుకు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సర్పంచ్ ఎన్ సృజన కోరారు. శనివారం స్వచ్ఛాంధ్రలో భాగంగా పంచాయతీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నగర పంచాయతీగా మార్పునకు పాలకవర్గం కూడా ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. స్పందించిన ఎమ్మెల్యే నగర పంచాయతీగా మార్పునకు కృషి చేస్తామని తెలిపారు.

వైభవంగా సరస్వతి పూజ

కావలి: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పదోతరగతి విద్యార్థినులు సరస్వతి పూజను శనివారం నిర్వహించారు. సర్వశిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ వెంకటసుబ్బయ్య, ఏఎంఓ సుధీర్‌బాబు, జీసీడీఓ మమత పాల్గొన్నారు. పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినులకు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని బీ హెప్సీసైమన్ విద్యార్థినులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. కేజీబీవీకి డిజిటల్ గడియారాన్ని బహూకరించారు. హెచ్‌ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి

అల్లూరు: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కాన్షీరామ్ చిత్రపటానికి అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు సాల్మన్‌రాజ్ పూలమాల వేసి శనివారం నివాళులర్పించారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం


ఆత్మకూరులో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు/అల్లూరు/కొండాపురం/ఏఎస్‌పేట/దుత్తలూరు/ఉదయగిరి/వరికుంటపాడు/సోమశిల/కలిగిరి: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతిఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, కప్పులను నిషేధించాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని పిలుపునిచ్చారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం'పై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఆర్డీఓ బీ పావని పాల్గొని ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో తలెత్తే సమస్యలను వివరించారు. ప్రతిఒక్కరూ చేతి సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. అలాగే అల్లూరులో నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే కొండాపురం మండలం గుడవల్లూరులో ఎంపీడీఓ ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే అనుమసముద్రంపేట మండలంలోని అనుమసముద్రం పంచాయతీలోని మహిళలతో ఎంపీడీఓ ప్రసన్నకుమారి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీ ప్రాంగణంలో డాక్టర్ మంజులమ్మ ఆధ్వర్యంలో చెత్తను తొలగించి మొక్కలు నాటారు. దుత్తలూరు బీసీ కాలనీలో ఎంపీడీఓ మల్లికార్జున ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. నందిపాడు కేజీబీవీ విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ స్వామి విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. వరికుంటపాడులో ఎంపీడీఓ వేణుగోపాల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతసాగరం మండలం కొత్తపల్లిలో ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ పంచాయతీ కార్యదర్శి రమణారావుతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు.కలిగిరి మండలం అయ్యప్పరెడ్డిపాళెంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.హెచ్‌ఎం కందుల వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడు గాదిరెడ్డి మురళీకృష్ణ, అంగన్‌వాడీ సుంకరి మాధవి,తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

సంగం: స్థానిక సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి శనివారం పరిశీలించారు. కేంద్రంలోని సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ సోమ్లానాయక్, సొసైటీ సీఈఓ దస్తగిరి ఉన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా మల్లికార్జున శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండల ఎంపీడీఓగా పని చేస్తున్న మీసాల వెంకటేశ్వర్లు సెలవుపై వెళ్లడంతో ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న మల్లికార్జునకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఎంపీడీఓగా జిల్లా అధికారులు నియమించారు.

ఉపాధి నిధుల రికవరీకి ఆదేశం

సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు గ్రామాల్లో అక్రమాలు జరిగినట్లుగా తేల్చారు. అయ్యవారిపల్లి రూ. 35,977, బాలాయపల్లి రూ.1,27,182, బసినేనిపల్లి రూ.11,30,153, చిన్నాగంపల్లి రూ.56,476, దేవమ్మచెరువు రూ.751, దేవరాజు సూరాయపల్లి రూ.41,714, దేవిశెట్టిపల్లి రూ.1,032, గుండుపల్లి రూ.17,160, జయపురం రూ.14,471, మారంరెడ్డిపల్లి రూ.4,46,627, నెమళ్లదిన్నె రూ.59,904, పబ్బులేటిపల్లి రూ.8,600, సీతారామపురం రూ.5,84,393, సింగారెడ్డిపల్లి రూ.1,56,462 చొప్పున రికవరీకి డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. అలాగే పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి రూ.3,71,832 ను రికవరీకి ఆదేశించారు.

పదోతరగతి పరీక్షల ఏర్పాట్ల పరిశీలన

అనుమసముద్రంపేట/చేజర్ల: ఏఎస్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో పదోతరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎంఈఓ-2, డిపార్ట్‌మెంటల్ అధికారి సాయిప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చిరమన, గుడిపాడు, శ్రీకొలను, ఏఎస్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, ఠాగూర్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 248 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామని తెలిపారు. మండలంలోని కావలియడవల్లి, గుంపర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు కలిగిరిలోని పరీక్ష కేంద్రంలో, దూబగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వింజమూరులో కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.